క్లుప్తంగా

లింగ వివక్ష రూపుమాపుదాం



మహిళలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

గుంతకల్లు రూరల్: లింగ వివక్ష రూపుమాపేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని హెల్త్ ఎడ్యుకేటర్ సత్యనారాయణ సూచించారు. శనివారం నక్కనదొడ్డి గ్రామంలో పర్యటించిన వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది గ్రామంలో నిర్వహిస్తున్న కుట్టు శిక్షణ కేంద్రానికి వెళ్లి మహిళలకు లింగ వివక్ష, బాల్య వివాహాల నిర్మూలన, మహిళా హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించారు. అలాగే ప్రతి ఒక్కరూ బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలన్నారు.

నేడు నీలం సంజీవరెడ్డి వర్ధంతి

గార్లదిన్నె: మండలంలోని కల్లూరులో ఆదివారం మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి వర్ధంతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ కల్లూరులోని నీలం సంజీవరెడ్డి సర్కిల్‌లో వర్ధంతి కార్యక్రమం రాజకీయ పార్టీలకు అతీతంగా నిర్వహిస్తామన్నారు. మండలంలోని వివిధ రాజకీయ పార్టీ నాయకులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

సీఎస్‌ఐ చర్చి నూతన కమిటీ ఎంపిక



గుత్తి ఆర్‌ఎస్ సీఎస్‌ఐ చర్చి సంఘ సభ్యులు

గుత్తి: గుత్తి ఆర్‌ఎస్‌లోని సీఎస్‌ఐ చర్చిలో శనివారం పాస్టర్ రెవరెండ్ డేవిడ్‌నాయక్ ఆధ్వర్యంలో చర్చి సంఘం(కమిటీ) ఎన్నికలు నిర్వహించారు. సెక్రటరీగా చార్లెస్, సభ్యులుగా ప్రసాదరావు, సాల్మన్ రాజు, రవిబాబు, రూతు, కళావతి, రాజకుమారి, అనిల్‌కుమార్, మేరీ స్టెల్లా, షారోన్, జయ, హేమావతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాగా చార్లెస్ గత 20 ఏళ్లగా చర్చి సంఘం సెక్రటరీగా ఏకగ్రీవంగా ఎన్నికవుతుండడంపై పాస్టర్ డేవిడ్ నాయక్‌తో పాటు సభ్యులు, క్రైస్తవులు అభినందించారు.


శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే చర్యలు



పెద్దవడుగూరు లో నాకా బందీ నిర్వహిస్తున్న పోలీసులు

పెద్దవడుగూరు: శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ ఆంజనేయులు హెచ్చరించారు. మండల కేంద్రంలోని చేనేత కాలనీ, ఎస్టీ కాలనీల్లో శనివారం పోలీసులు నాకాబందీ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని అనుమానితులు, రౌడీ షీటర్ల ఇళ్లలో సోదాలు నిర్వహించారు. గ్రామంలో ఎవరైనా గొడవలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. నూతన వ్యక్తులు అనుమానాస్పదంగా కనపడినా, అసాంఘిక కార్యాకలాపాలకు పాల్పడినా పోలీసుల దృష్టికి తీసుకనావాలని సూచించారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా 9440796826 నంబర్‌కు సమాచారం అందించాలన్నారు.

కల్లూరు రైల్వే వంతెన తనిఖీ



అధికారులకు సలహాలిస్తున్న డీఆర్‌ఎం సీఎస్ గుప్తా

గుంతకల్లు: డివిజన్ పరిధిలోని గుంతకల్లు–కల్లూరు రైలు మార్గంలో పెన్ననదిపై నిర్మించిన (కల్లూరు రైల్వేస్టేషన్ సమీపంలో) వంతెన నంబర్ 45ను శనివారం డీఆర్‌ఎం చంద్రశేఖర్ గుప్తా పరిశీలించారు. సంబంధిత శాఖల అధికారులతో కలసి ఆయన ప్రత్యేక రైళ్లలో అక్కడకు చేరుకున్నారు. ఈ సందర్భంగా వంతెనపై కలియతిరిగారు. రైలు మార్గం పటిష్ఠతను చెక్ చేశారు. ఎలాస్టోమెరిక్ బేరింగ్‌లు, పీఎస్‌సీ గిర్డర్ క్యాంబర్, సీల్ట్ గిర్డర్లతో పాటు బేరింగ్ అండ్ టాప్ ప్లేట్‌లను పరిశీలించి దెబ్బతిన్న వాటిలో కొత్తవి ఏర్పాటు చేయాలన్నారు. అంతేకాకుండా తుప్పు పట్టిన పరికారలను తొలగించి భద్రతా ప్రమాణాలను మెరుగుపరచాలని ఆదేశించారు. రైలు ప్రయాణికుల భద్రతే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఈఎస్ నార్త్ పి. సింగ్, సీనియర్ డీఓఎం శ్రావణ్, డీసీఎం శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'కల్లూరులో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపాలి'

పామిడి: కల్లూరు రైల్వే జంక్షన్‌లో ముంబాయి, విజయవాడకు వెళ్ళే ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఐదు నిమిషాల పాటు నిలపాలని పామిడి మాజీ ఎంపీటీసీ కే రహీమ్ ఆధ్వర్యంలో చెన్నవరం జాకీర్, సుదర్శన్ తదితర వ్యాపారులు డీఆర్‌ఎం గుప్తాకు వినతిపత్రం అందజేశారు. శనివారం కల్లూరు వై జంక్షన్‌కు విచ్చేసిన డీఆర్‌ఎంను వారు కలిసి వినతిపత్రం సమర్పించారు.



స్వామి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు



భక్తులతో నిండిపోయిన క్యూలైన్లు

కసాపురంలో భక్తుల సందడి

గుంతకల్లు: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేస్వామి దేవాలయంలో భక్తుల సందడి నెలకొంది. వేసవి సెలవులు త్వరలో ముగియనుండడంతోపాటు శనివారం కావడంతో కసాపురం ఆలయ ప్రాంగణం, పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. అర్చకులు వేకువజామునే నెట్టికంటి మూలవిరాట్‌కు అభిషేకం చేసి, బంగారంతో తయారు చేసిన వజ్రకవచ అలంకరణ, విశేష పుష్పాలతో అందగా ముస్తాబు చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు గావించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. భక్తులు స్వామివారికి వడమాల, ఆకు పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. వేలాది మంది తరలిరావడంతో ఆలయ ప్రాంగణం, పరిసరాలు కిక్కిరిసాయి.

స్వామి దర్శనానికి దాదాపు గంటకు పైగా సమయం పట్టింది. దాదపు 30 వేలకు పైగా భక్తులు స్వామి దర్శనం చేసుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. కాగా గుంతకల్లులోని సత్యనారాయణపేటలో రైల్వేమోరీ వద్ద కసాపురం వచ్చే భక్తుల వాహనాలతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది.



వజ్రకవచ అలంకరణలో నెట్టికంటి ఆంజనేయస్వామి మూలవిరాట్

టీడీపీ నాయకుడిని అరెస్ట్ చేయాలి



గుంతకల్లులో నిరసన తెలుపుతున్న సచివాలయ ఉద్యోగులు



పెద్దపప్పూరులో ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకుడు చింతా పురుషోత్తం

గుంతకల్లుటౌన్/పెద్దపప్పూరు: టీడీపీ మహానాడుకు ప్రజల్ని తరలించలేదన్న కారణంతో అనంతపురం 29వ వార్డు సచివాలయ సంక్షేమ కార్యదర్శి అశ్వర్థరెడ్డిని నానా దుర్భాషలాడిన టీడీపీ నాయకుడు రాజేష్‌నాయుడిని పోలీసులు వెంటనే అరెస్ట్ చేయాలని సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సుదర్శన్ డిమాండ్ చేశారు. ఈ ఘటనను వ్యతిరేకిస్తూ శనివారం సాయంత్రం గుంతకల్లు పట్టణంలోని రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహం ఎదుట సచివాలయ ఉద్యోగులు నిరసన తెలిపారు. సుదర్శన్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ కార్యక్రమాలకు సచివాలయ ఉద్యోగులను వాడుకోకూడదన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేస్తున్న సచివాలయ ఉద్యోగులను కించపరిచేలా మాట్లాడటం సరికాదన్నారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగుల సంఘం సంయుక్త కార్యదర్శి మంజునాథ్, కోశాధికారి పుష్యమి, లీగల్ అడ్వైజర్ కాశప్ప, యోగానంద తదితరులు పాల్గొన్నారు.అలాగే టీడీపీ నాయయకుడు రాజేష్ నాయుడుపై కేసు నమోదు చేయాలని సీపీఐ మండల నాయకుడు చింతా పురుషోత్తం పెద్దపప్పూరులో ఎంపీడీఓ శంకుంతలకు వినతిపత్రం అందజేశారు. చింతా రామక్రిష్ణ, మల్లికార్జున, తలారి రామక్రిష్ణ, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

'జేసీ కమిటీ'ని అనుమతించేది లేదు



తహసీల్దార్, సీఐని ప్రశ్నిస్తున్న ఫయాజ్‌బాషా

తాడిపత్రిరూరల్: టీడీపీ నాయకుడు, మునిసిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి నియమించిన కమిటీని తన ఇంటి కొలతలకు అనుమతించేది లేదని తహసీల్దార్ రజాక్‌వలి, పట్టణ సీఐ సాయి ప్రసాద్‌లతో వైఎస్సార్ సీపీ నాయకుడు ఫయాజ్‌బాషా తీవ్రస్థాయిలో వాగ్వివాదానికి దిగారు. చైర్మన్ జేసీ కక్ష సాధింపులో భాగంగా పట్టణంలోని చిన్నబజారులో ఫయాజ్‌బాషా కొత్తగా నిర్మించుకున్న ఇంటిని అక్రమ నిర్మాణంగా చిత్రించేందుకు తహసీల్దార్ ఆధ్వర్యంలో కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ మూడోసారి శనివారం కొలతల కోసం ఆ ఇంటి వద్దకు వచ్చింది. ఈ సమయంలో ఇంటి కొలతలకు కమిటీని ఫయాజ్‌బాషా అనుమతించలేదు. ఇంటి కొలతలపై స్టే ఉందని, అందుకు సంబంధించిన కాగితాలను తహసీల్దార్‌కు చూపించారు. వాటిని పరిశీలించిన తహసీల్దార్ కేవలం ఇంటి కొలతలు తీసుకొని వెళతామని ఫయాజ్‌బాషాకు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. తన ఇంటిపై మద్దతుదారులతో రాళ్ల దాడి చేయించిన మునిసిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి నియమించిన కమిటీని ఎలా ఇంటి లోపలికి కొలతల కోసం అనుమతిస్తానని మండిపడ్డారు. ఈ వివాదంపై తమ లాయర్‌తో మాట్లాడాలంటూ ఫోన్ చేయించారు. మధ్యలో జోక్యం చేసుకున్న పట్టణ సీఐ సాయిప్రసాద్ కొలతలకు వచ్చిన ప్రతిసారి ఏదో ఒక వివాదం పెడుతున్నావంటూ ఫయాజ్‌బాషాతో మాట్లాడేందుకు ప్రయత్నించారు. ఎవరు చెప్పినా కమిటీని కొలతలకు అనుమతించేది లేదని ఖరాఖండీగా చెప్పారు. జూన్‌లో హైకోర్టు ఆదేశాల మేరకు జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే కమిటీ ద్వారా ఇంటి కొలతలకు అనుమతి ఇస్తానని, అంతవరకూ వేచి ఉండాలని తహసీల్దార్, సీఐను కోరారు. విషయాన్ని ఏఎస్పీ రోహిత్‌కుమార్‌కు ఫోన్‌లో సీఐ వివరించారు. చివరకు పోలీసు బందోబస్తు మధ్య తహసీల్దార్ రజాక్‌వలి, సబ్‌రిజిస్ట్రార్ శివనారాయణ, టౌన్ సర్వేయర్ కైవల్యసాయి తదితరులు ఇంట్లోకి వెళ్లి కొలతలు తీసుకున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభమైన కొలతలు దాదాపు మూడు గంటలపాటు సాగాయి. ఎలాంటి ఉద్రిక్తతలు తలెత్తకుండా ఇంటి కొలతలు పూర్తి కావడంతో పోలీసు, కమిటీ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు.

ఘనంగా వేంకటేశ్వరుడి విగ్రహ ప్రతిష్ట



పూజల్లో పాల్గొన్న ఉషశ్రీచరణ్, దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి కుటుంబ సభ్యులు



వెంకన్న సేవలో అనంత వెంకట్రామిరెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి, శైలజానాథ్



రాతిదూలం లాగుడు పోటీలను ప్రారంభిస్తున్న కేతిరెడ్డి పెద్దారెడ్డి

యల్లనూరు: నమో వేంకటేశాయా, గోవింద నామ స్మరణలతో తిమ్మంపల్లి గ్రామం దద్దరిల్లింది. గ్రామంలో తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆశీస్సులతో సుమారు రూ.5 కోట్ల వ్యయంతో శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవాలయాన్ని నిర్మించారు. వేకువజామున వేద పండితుల మంత్రోచ్ఛారణ నడుమ వేంకటేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు అర్చకులు ప్రసాదు శర్మ, శేషగిరి శర్మ ఆధ్వర్యంలో వైభవంగా చేపట్టారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మాజీ మంత్రులు ఉషశ్రీచరణ్, డాక్టర్ సాకే శైలజానాథ్, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్, మాజీ ఎమ్మెల్యేలు అనంత వెంకటరామిరెడ్డి , విశ్వేశ్వరరెడ్డి, దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి, కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి, తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే (గుడి నిర్మాత) కేతిరెడ్డి పెద్దారెడ్డి, భార్య రమాదేవి, కుమారులు ఆలయ కమిటీ చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి, సాయి ప్రతాప్‌రెడ్డి, కోడళ్లు ముఖ్య అతిథులుగా హాజరై పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బొప్పేపల్లి రామాంజులరెడ్డి, గొడ్డుమర్రి ఈశ్వరరెడ్డి, నార్పల సత్యనారాయణరెడ్డి, తిరుమలాపురం సర్పంచు అజ్జుగుట్టు రామాంజులరెడ్డి, మేడికుర్తి సర్పంచు ప్రభాకర్‌రెడ్డి, దంతపల్లి మాజీ సర్పంచు విజయ్‌భాస్కర్‌రెడ్డి, కల్లూరు సూరి, కొత్తపల్లి పురుషోత్తంనాయుడు, యల్లనూరు కిరణ్, బండ్లపల్లి ప్రతాప్, శింగనమల పూల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా రాతిదూలం పోటీలు

ఉదయం 8.30 గంటలకు రాతిదూలం లాగుడు పోటీలను తాడిపత్రి, ధర్మవరం మాజీ ఎమ్మెల్యేలు కేతిరెడ్డి పెద్దారెడ్డి, కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డిలు, వైఎస్సార్ ఆస్పత్రి అధినేత కేతిరెడ్డి వెంకట మోహన్‌రెడ్డి, కేతిరెడ్డి వెంకట నాగిరెడ్డి ప్రారంభించారు. కాగా మొదటి బహుమతి రూ.1.20 లక్షలను వైఎస్సార్ జిల్లా మైదుకూరు కుర్ర వెంకటేష్ వృషభాలు దక్కించుకున్నాయి. అలాగే వరుసగా తెలంగాణ రాష్ట్రం చెందిన హుజూర్నగర్ కి చెందిన సుంకి సురేందర్‌రెడ్డి వృషభాలు రూ.లక్ష, నంద్యాల జిల్లా గుంపరమసుదిన్నె చెందిన కుందురు రాంభూపాల్‌రెడ్డి వృషభాలు రూ.80 వేలు, అనంతపురం జిల్లా మేడిమాకులపల్లి తోట తిరుపాల్‌రెడ్డి వృషభాలు రూ.60 వేలు, నంద్యాల జిల్లా హుస్సేనాపురం రామసుబ్బారెడ్డి వృషభాలు రూ.40 వేలు, వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు రమేష్‌బాబు వృషభాలు రూ. 30 వేలు కైవసం, గార్లదిన్నె మండలానికి చెందిన రామాంజినేయులు వృషభాలు రూ.20 వేలు దక్కించుకున్నాయి. అలాగే పోటీల్లో పాల్గొన్న వృభాలకు రూ.10వేలు కన్సొలేషన్ బహుమతిని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ప్రదానం చేశారు. రాత్రికి శుభమస్తు ఆర్కెస్ట్రా కేవీ సుధాకర్ ఆధ్వర్యంలో శ్రీదేవి డ్రామా కంపెనీ ఫేమ్ పల్సర్ బైక్ ఝాన్సీ టీమ్ (గాజువాక కండెక్టరు) జానపదాలు, నృత్యాలతో ప్రముఖ సింగర్ రూపాదేవి చేసిన డ్యాన్సులు అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు, పుట్లూరు సీఐ సత్యబాబు, యల్లనూరు, పుట్లూరు ఎస్‌ఐలు రామాంజనేరెడ్డి, నరసింహంలు బందోబస్తు పర్యవేక్షించారు.

ఆటోలో మరిచిన ఆభరణాల బ్యాగు అప్పగింత



బాధితురాలికి బ్యాగును అందజేస్తున్న పోలీసులు

గుంతకల్లుటౌన్: ఆటోలో ప్రయాణిస్తూ పొగొట్టుకున్న ఒక తులం బంగారు, 20 తులాల వెండి ఆభరణాలతో కూడిన బ్యాగును వన్‌టౌన్ పోలీసులు గంట వ్యవధిలో పట్టుకుని బాధితురాలికి అప్పగించారు. కర్నూల్ జిల్లా చిప్పగిరి మండలం కుందనకుర్తి గ్రామానికి చెందిన రసూల్‌బీ తన కుమారుడి పెళ్లి నిమిత్తం బంధువులతో కలిసి ఆదోనిలో బంగారు, వెండి ఆభరణాలను కొనుగోలు చేసి శనివారం గుంతకల్లు రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి ఓ ఆటోలో ధర్మవరం గేట్ సమీపంలోని తన బంధువుల ఇంటికెళ్లారు. అరగంట తరువాత ఆభరణాల బ్యాగు కనిపించకపోవడంతో ఆటోలోనే మరిచిపోయినట్లు గుర్తు తెచ్చుకున్నారు. దీంతో రసూల్‌బీ బంధువు మహ్మద్ వలి ద్వారా వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సమాచారమిచ్చారు. వన్‌టౌన్ సీఐ మనోహర్ ఆదేశాల మేరకు పోలీసులు నాగేశ్వరరావు, కుమారస్వామి రైల్వేస్టేషన్‌లో గాలించి ఎట్టకేలకు ఆటోను గుర్తించారు. అయితే డ్రైవర్ వీరేష్ కూడా ఆటోలో ప్రయాణికులు మరిచిపోయిన బ్యాగును గుర్తించలేదు. దీంతో ఆటోలోనే ఉన్న ఆభరణాల బ్యాగును స్వాధీనం చేసుకున్న పోలీసులు బాధితులను పీఎస్‌కు రప్పించి వారికి అప్పగించారు. ఈ సందర్భంగా బాధితులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

విత్తనశుద్ధి తప్పకుండా చేసుకోవాలి



పెద్దవడుగూరులో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారిణి ఉమామహేశ్వరమ్మ

పెద్దవడుగూరు/గార్లదిన్నె: రైతులు పంటలను సాగు చేసే సమయంలో విత్తన శుద్ధి తప్పకుండా చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారిణి ఉమామహేశ్వరమ్మ, శాస్త్రవేత్తలు మల్లీశ్వరి, కిషోర్, ఏఆర్‌ఎస్ లక్ష్మణ్ సూచించారు. వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం పెద్దవడుగూరులోని రైతు సేవా కేంద్రంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఖరీఫ్ సీజన్‌లో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన డ్రోన్ వ్యవసాయ పరికరాలను ఉపయోగించుకోవాలన్నారు. రసాయన ఎరువులు వాడటం వలన కలిగే నష్టాలు, సేంద్రియ ఎరువులు వాడటం వలన కలిగే లాభాలను వివరించారు. కార్యక్రమంలో ఏఓ మల్లీశ్వరి, ఏఈఓలు , సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

- గార్లదిన్నె మండలంలోని మర్తాడు,కోటంక గ్రామాల్లో వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం వ్యవసాయ అధికారులు నిర్వహించారు. డీఏఓ ఉమమహేశ్వరమ్మ , కృషి విజ్ఞాన కేంద్రం, రెడ్డిపల్లి శాస్త్రవేత్త మల్లేశ్వరి మాట్లాడుతూ రైతులు పొలాల్లో తప్పనిసరిగా ఫారమ్ పాండ్స్ తవ్వకోవాలన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు సుధీర్, శశికళ, రాజన్న, ఉద్యాన శాఖ అధికారి రత్నకుమార్, ఏఓ సోమశేఖర్, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

రాయలసీమ అభివృద్ధికి తూట్లు

గుంతకల్లు: రాయలసీమ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం తూట్లు పొడుస్తోందని వైఎస్సార్‌సీపీ ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడు వై.రాజశేఖర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.. శనివారం ఆయన గుంతకల్లులో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ శ్రీభాగ్ ఒప్పందం ప్రకారం కర్నూలును న్యాయ రాజధానిగా ప్రకటించి హైకోర్టు లా యూనివర్సిటీతోపాటు న్యాయ విభాగానికి సంబంధించి అన్ని ప్రధాన కార్యాలయాలు ఏర్పాటు చేయాలన్నారు. రాయలసీమ ఎత్తిపోతల పథకానికి తెలంగాణ ప్రభుత్వం అడ్డుపడితే కూటమి ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. అలాగే కడపకు వచ్చిన జిందాల్ ఉక్కు ఫ్యాక్టరీని బెదరించి వెళ్లగొట్టి.. ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే అనంతపురం జిల్లాకు రావాల్సిన ఎయిమ్స్ ఆస్పత్రిని ఏర్పాటు చేయాలని, అదేవిధంగా రైల్వే వ్యాగన్ ఫ్యాక్టరీకి నిధులు విడుదల చేయించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గోపాల్‌రెడ్డి, రామరంగారెడ్డి, దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌కార్డున్న ప్రతి ఒక్కరికీ 'ఉపాధి'

గుత్తి రూరల్: జాబ్ కార్డు ఉండి పనులు అడిగిన ప్రతి కూలీకి ఉపాధి పనులు కల్పిస్తామని ఎంపీడీఓ ప్రభాకర్ నాయక్ సూచించారు. శనివారం మండలంలోని తొండపాడు గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీఓ తనిఖీ చేశారు. పనులు జరిగే ప్రదేశానికి వెళ్లి జాబ్ కార్డుల్లో ఉన్న వారే పనులు చేస్తున్నారా లేదా అని ఆరా తీశారు. ఉదయం 6 గంటల నుంచి 12 గంటల వరకూ ప్రతి కూలీ తప్పకుండా కూలీ పనులు చేయాలని ఎంపీడీఓ సూచించారు. కొలతల ప్రకారం పనులు చేయాలన్నారు. అనంతరం మస్టర్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో టీఏ, ఎఫ్‌ఏలు పాల్గొన్నారు.

ధూమపాన రహిత సమాజానికి కృషి

యాడికి/గార్లదిన్నె: ప్రతి ఒక్కరూ ధూమపాన రహిత సమాజం కోసం కృషి చేయాలని ప్రభుత్వ వైద్యాధికారి పరమేశ్వర సూచించారు. శుక్రవారం యాడికి పీహెచ్‌సీలో ధూమపాన రహిత దినోత్సవాన్ని పురస్కరించుకుని ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పొగాకు వినియోగించడం వల్ల నోటి క్యాన్సర్, దంత వ్యాధులు, క్షయ, ఊపిరితిత్తుల క్యాన్సర్ వస్తాయన్నారు. బీడీలు, సిగరెట్లు, గుట్కా, ఖైనీ వంటి వాటికి దూరంగా ఉండేటట్లు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

– గార్లదిన్నె మండల వ్యాప్తంగా ఆయా గ్రామాల సచివాలయాల్లో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం సందర్భంగా వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ లోక్‌నాథ్, ఆరోగ్యవిస్తరణ అధికారి నాగేశ్వరయ్య, హెల్త్ సూపర్‌వైజర్లు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మండలానికి చేరిన విద్యాసామగ్రి

పెద్దవడుగూరు: మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలకు ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించిన నోట్ బుక్స్, యూనిఫాం, బ్యాగులు చేరినట్లు ఎంఈఓ గురుప్రసాద్, హెచ్‌ఎం సుధాకర్‌బాబు తెలిపారు. సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా మిత్ర పథకం ద్వారా విద్యార్థులకు పాఠశాల ప్రారంభం రోజున వాటిని అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సీఆర్‌పీలు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు 'వెన్నుపోటు దినం' పోస్టర్ల ఆవిష్కరణ

గుంతకల్లుటౌన్: కూటమి ప్రభుత్వ నిరంకుశ పరిపాలనకు నిరసనగా జూన్ 4న వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న వెన్నుపోటు దినం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆదివారం పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించనున్నట్లు ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఖలీల్ తెలిపారు. ఉదయం 9:30 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వై.వెంకటరామిరెడ్డి హాజరవుతారన్నారు. పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని వారు శనివారం ఓ ప్రకటనలో కోరారు.

గార్లదిన్నె: గార్లదిన్నె, శింగనమల మండలాల్లో వైఎస్సార్‌సీపీ శింగనమల నియోజకవర్గ సమన్వయ కర్త డాక్టర్ సాకే శైలజానాథ్ ఆధ్వర్యంలో జూన్ 4న వెన్నుపోటు దినంకు సంబంధించి ఆదివారం పోస్టర్లు విడుదల చేస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు నారాయణరెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ గార్లదిన్నె మండలంలోని మర్తాడు క్రాస్ సమీపంలో టీ కన్వెన్షన్ హాల్లో మధ్యాహ్నం 2.30 గంటలకు శైలజానాథ్ పోస్టర్లు ఆవిష్కరణ చేస్తారని, అనంతరం మీడియా సమావేశం నిర్వహిస్తారన్నారు.అలాగే శింగనమల మండలంలో రామాలయం గుడి వద్ద ఉదయం 11 గంటలకు పోస్టర్లు విడుదల కార్యక్రమం ఉంటుందన్నారు. ఆయా మండలాల్లోని జెడ్పీటీసీలు, ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘం నాయకులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

మరుగుదొడ్లను శుభ్రం చేశారు!



శుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికులు

సాక్షి ఎఫెక్ట్..

పెద్దపప్పూరు: మండలంలోని అశ్వత్థ నారాయణస్వామి క్షేత్రంలో భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన మరుగుదొడ్లను శనివారం పారిశుధ్య కార్మికులు శుభ్రం చేశారు. మరుగుదొడ్లు కంపుకొడుతున్నా అధికారులు అటువైపు దృష్టి సారించలేదని సాక్షిలో శనివారం కంపు కంపు అనే కథనం వెలువడడంతో ఆలయ కార్యనిర్వహణాధికారి సుబ్రమణ్యం సిబ్బందిపై మండిపడ్డారు. తక్షణమే మరుగుదొడ్లను శుభ్రం చేయాలని సిబ్బందిని ఆయన ఆదేశించారు. సమస్య పరిష్కారమవడంతో సాక్షికి భక్తులు కృతజ్ఞతలు తెలిపారు.

పదవీ విరమణ సన్మానం



ఎంపీడీఓ శ్రీకాంత్ చౌదరిని సత్కరిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: గుంతకల్లు ఎంపీడీఓ శ్రీకాంత్ చౌదరి, కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ గౌసియా బేగం పదవీ విరమణ సందర్భంగా కార్యాలయ సిబ్బంది, ఇతర అధికారులు వారికి ఘనంగా వీడ్కోలు పలికారు. ఎంపీపీ బీవీ మాధవి, డీఎల్‌డీఓ విజయలక్ష్మి, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పూలమాలలు, శాలువాలు వేసి వారిని సత్కరించారు. గార్లదిన్నె: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సీఎస్‌డీటీగా పనిచేస్తున్న హరిప్రియ పదవీ విరమణ పొందారు. ఈసందర్భంగా కార్యాలయ సిబ్బంది సీఎస్‌డీటీని పూలమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఈరమ్మ, డీటీ మల్లికార్జున, ఆర్‌ఐ, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయం ఎదుట రేపు మహాధర్నా



చెత్తాచెదారంతో నిండిన డ్రైనేజీని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

గుంతకల్లుటౌన్: పట్టణంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో అధికారుల వైఖరిని నిరసిస్తూ ఈ నెల 2న మున్సిపల్ కార్యాలయం ఎదుట చేపట్టనున్న మహాధర్నాను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బి.శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి మారుతి కోరారు. ప్రజా పోరు పాదయాత్ర కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలోని 10, 11వ వార్డుల్లో వారు పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. పట్టణంలో పారిశుధ్యం లోపించిందని, కుక్కల బెడద అధికమైనా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని వారు మండిపడ్డారు. పార్టీ నాయకులు నాగరాజు, తిమ్మప్ప, తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత నర్స్ మృతి



కమలమ్మ (ఫైల్)

యాడికి: మండల కేంద్రంలోని కోటవీధికి చెందిన విశ్రాంత నర్స్ కమలమ్మ(80) శుక్రవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. సమాచారం అందుకున్న సీపీఐ మండల కన్వీనర్ మహమ్మద్ రఫీ, నాయకుడు జూటూరు రజాక్ శనివారం ఉదయం కమలమ్మ భౌతిక కాయానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

యోగాతో మానసిక ప్రశాంతత

గుత్తి: యోగా మానసిక ప్రశాంతతను కలిగిస్తుందని మాస్టర్లు కృష్ణయ్య, రామకృష్ణ అన్నారు. గుత్తిలోని పురావస్తు శాఖ కార్యాలయ ఆవరణలో, ప్రభుత్వాస్పత్రిలో శనివారం యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. యోగా మాస్టర్లు మాట్లాడుతూ యోగా జీవితంలో భాగం కావాలన్నారు. యోగా చేస్తే రోగులు దరి చేరవన్నారు. ఆరోగ్యం భేషుగ్గా ఉంటుందన్నారు. కార్యక్రమంలో కమిషనర్ జబ్బార్‌మియా, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్లప్ప, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.